నమస్తే తెలంగాణ

ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | బుధవారం 27 మార్చి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


## ఉద్యోగాల దందాపై విజిలెన్స్ విచారణ

**ఏజెన్సీ అక్రమ వసూళ్లపై ఆరా**

**బాధితుల నుంచి వివరాల సేకరణ**

**జిల్లా ఆస్పత్రిలో నియామకాలపై నజర్**

**నమస్తే ఎఫెక్ట్**

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో ఉద్యోగాల దందాపై విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ నెల 23న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'ఉద్యోగాల పేరుతో దందా' కథనానికి వారు స్పందించారు. నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని ఏజెన్సీలు, దళారులు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసిన తతంగంపై ఆరా తీస్తున్నారు. బాధితుల వద్దకు వెళ్లి ఎవరెవరికి ఎంత డబ్బులు అందజేశారనే విషయమై వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు కలెక్టర్ కార్యాలయం, మెడికల్ కళాశాలల్లో ఇప్పటికే చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాలపై కూపీ లాగుతున్నారు. వంద పడకల జిల్లా ఆస్పత్రి, కలెక్టరేట్, మెడికల్ కళాశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఏజెన్సీ సంస్థలు, దళారులు నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కలెక్టరేట్, మెడికల్ కళాశాలతో పాటు పలు కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని స్పార్క్ అండ్ సాయినాథ్ ఏజెన్సీ ప్రొప్రైటర్ ఎండీ ఖాజాపాషా తమ వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితులు జీ మల్లీశ్వరి, జీ మహేందర్, బీ లక్ష్మీనారాయణ, తిరుపతి, జీ రవీందర్, భద్రయ్య, రాజు, సంపత్, రాజేశ్వరి, సుమతి, సది తదితరులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కాగా, స్పార్క్ అండ్ సాయినాథ్ ఏజెన్సీతో పాటు మరో సంస్థ నిర్వాహకులు, దళారుల దందాపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు.



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన కడియం కావ్య

హనుమకొండ/ చిల్పూరు, మార్చి 26 : బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్య ర్థి డాక్టర్ కడియం కావ్య మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనపై నమ్మకంతో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.



బుర్ర స్వరూపను డిశ్చార్జి చేస్తున్న వైద్యులు

## మహిళకు పునర్జన్మ

**బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం**

**సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల ఘనత**

**వైద్య బృందానికి బాధిత కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**

వరంగల్ చౌరస్తా, మార్చి 26: వరంగల్ కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులు అరుదైన ఘనత సాధించారు. బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి బాధితురాలికి పునర్జన్మనిచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా కమలాపురం మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన బుర్ర స్వరూప తల, నరాల తీవ్ర నొప్పి, ఫిట్స్‌తో బాధపడుతూ ఈ నెల 11న వరంగల్‌లోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులను సంప్రదించింది. ఆమెకు పరీక్షలు చేసిన డాక్టర్లు.. స్వరూప మెదడులో కణితి పెరగడం వల్ల ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఈ నెల 18న న్యూరో సర్జన్ విభాగాధిపతి డాక్టర్ మహ్మద్ సికిందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సచిన్, డాక్టర్ వీరేశ్, అనస్థీషియా వైద్యులు మురళి, చంద్రశేఖర్, కిరణ్ బృందం సుమారు రెండున్నర గంటల పాటు శస్త్రచికిత్స చేశారు. స్వరూపను మంగళవారం డిశ్చార్జి చేశారు. బ్రెయిన్ ట్యూమర్‌ను గుర్తించి, విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన వైద్య బృందాన్ని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్‌తో పాటు పలువురు విభాగాధిపతులు అభినందించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎనుమాములలో తగ్గిన పత్తి ధర



కాశీబుగ్గ, మార్చి 26: ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి ధర క్వింటాల్‌కు రూ. 80 తగ్గింది. శుక్రవారం గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ. 7,250 ధర పలకగా, మంగళవారం గరిష్ఠంగా రూ. 7170, మధ్య రకానికి రూ. 6,500, కనిష్ఠంగా రూ. 6 వేల ధర పలికింది. సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7,020 కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరగడంతో ప్రైవేట్ వ్యాపారులు పోటీపడి మద్దతు ధర కన్నా అధిక రేటు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. పత్తి ధర తగ్గడంతో మూడు రోజుల సెలవుల తర్వాత మార్కెట్‌కు వచ్చిన రైతులకు నిరాశే ఎదురైంది.

- ఎండిపోయిన కుంటలు, పనిచేయని సోలార్ బోర్లు
- తాగునీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు
- సాసర్ పిట్స్, వాటర్ హోల్స్‌లో నీళ్లు నింపని అధికారులు
- అటవీ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జంతు ప్రేమికులు




నిరుపయోగంగా ఉన్న బోరు




ఎండిపోయిన నీటికుంట

# వన్యప్రాణుల దాహం తీరేదెలా?



ఎండిపోయిన గుంటోనికుంట



అడవిలో ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్స్

మహదేవపూర్, మార్చి 26 : వేసవిలో వన్యప్రాణులకు తాగునీటి గోస మొదలైంది. వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుంటలు అడుగంటాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని అడవిలో నీటికుంటలు, సాసర్‌పిట్స్, వాటర్ హోల్స్‌ను గతంలో ఏర్పాటుచేయగా అధికారుల పర్యవేక్షణ లోపించి, తాగునీరు లభించక మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఓ వైపు ఎండలు ముదురుతున్న సమయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోకుంటే జీవాల మనుగడకే ముప్పు వాటిల్లనుంది.

అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిధులతో మహదేవపూర్ అడవుల్లో సుమారు ఆరు సోలార్ బోర్లు, 20 సాసర్ పిట్స్, 20 వాటర్ హోల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో సోలార్ బోర్ సమీపంలో కృత్రిమంగా నీటికుంట తవ్వించారు. వేసవిలో బోర్ల సాయంతో నీటిని కుంటల్లో నింపి వన్యప్రాణులకు అందుబాటులో ఉంచాలి. కానీ అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో సోలార్ బోర్లు పనిచేయడం లేదు. దీంతో నీరు లేక కుంటలు ఎండిపోయి నెర్రెలుబారాయి. వేసవిలో ప్రత్యేకంగా ట్యాంకర్ ద్వారా సాసర్ పిట్స్, ఫామ్‌పాండ్స్‌లో నీటిని నింపాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఎక్కడ కూడా నీటిని నింపడం లేదు. ఈ విషయమై అటవీ శాఖ మండల అధికారి కమలను వివరణ కోరగా వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని, సోలార్ బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తామని, సాసర్ పిట్స్, కుంటల్లో నీరు నింపుతామని తెలిపారు.



స్వామివారికి పల్లకీ సేవ

## మార్మోగిన గోవింద నామస్మరణ

**వైభవంగా కోటంచ జాతర.. ప్రత్యేక ఆకర్షణగా ఏనుగు బండ్లు**

రేగొండ, మార్చి 25 : గోవింద నామస్మరణతో కోటంచ మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తజనం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. కోరిన కోర్కెలు నెరవేరినందుకు స్వామి వారికి ఏనుగు వాహనాలు, మేకలు, గుర్రం బండ్లను ప్రత్యేకంగా తయారు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల కోసం ఆర్టీసీ బస్సులు, తాగునీటి వసతి, స్నానఘట్టాలు, తదితర ఏర్పాట్లుచేశారు. ఆలయ చైర్మన్ మల్కనూరి భిక్షపతి, ఈవో బీ శ్రీనివాస్, ధర్మకర్తలు శ్రీపతి సుదర్శన్, మూల ఓంకార్, మల్లెబోయిన శ్రీధర్, డోలి కోటేశ్వర్‌రావు, జోగేందర్, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, కళావతి, లక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. ఎన్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు భక్తులకు 30వేల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



ఏనుగు వాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు



చేతులు ఎత్తి మార్నేని వెంకన్నకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎంపీ కవిత, వార్డు కౌన్సిలర్లు

## మానుకోట మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వెంకన్న

**సాధారణ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక**

**హాజరైన ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎంపీ కవిత**

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : మహబూబాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ పార్టీ వార్డు కౌన్సిలర్ మార్నేని వెంకన్నను కౌన్సిలర్లు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్‌పై వార్డు కౌన్సిలర్లు ఈనెల 4న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా నెగ్గింది. దీంతో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ ఎన్నిక కోసం మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో మొత్తం 36 మంది వార్డు కౌన్సిలర్లు ఉండగా, 32 మంది వార్డు కౌన్సిలర్లు, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీ మాలోత్ కవిత సమావేశానికి హాజరయ్యారు. ముగ్గురు వార్డు కౌన్సిలర్లు హాజరు కాలేదు. ఒక్కరు అకాల మరణం చెందారు. కాగా, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం మార్నేని వెంకన్నను 1వ వార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి ప్రతిపాదించగా, 29వ వార్డు కౌన్సిలర్ సూర్ణపు సోమయ్య బలపరిచారు. అందరూ చేతులు ఎత్తి మార్నేని వెంకన్నకు మద్దతు తెలిపారు. దీంతో వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అలివేలు ప్రకటించారు. సభ్యుల సమక్షంలో వైస్ చైర్మన్ వెంకన్నకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ, ఎమ్మెల్సీ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు నూతనంగా ఎన్నికైన వైస్ చైర్మన్ వెంకన్నను ఘనంగా సన్మానించారు.

### విధులను సక్రమంగా నిర్వర్తిస్తా

మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా విధులను సక్రమంగా నిర్వర్తిస్తా. మున్సిపాలిటీ పరిధిలో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తా. అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటా. మున్సిపాలిటీ పరిధిలో అన్ని పార్టీలకు చెందిన వార్డు కౌన్సిలర్లు తనపై నమ్మకంతో మద్దతు తెలిపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– మార్నేని వెంకన్న, నూతన వైస్ చైర్మన్



ఎన్నికల అధికారి నుంచి ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మార్నేని వెంకన్న



ఏఎస్సై శైలజకు ఫిర్యాదు చేస్తున్న వైల్డ్‌లైఫ్ జిల్లా సభ్యుడు సునీల్

## 'వైల్డ్‌లైఫ్ సొసైటీ' సభ్యుడిపై పోలీసుల దాడి

**హెడ్‌కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్‌పై ఠాణాలో ఫిర్యాదు**

శాయంపేట, మార్చి 26 : పత్తిపాక గ్రామానికి చెందిన ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ జిల్లా కమిటీ సభ్యుడు మారెపల్లి సునీల్‌పై పోలీసులు దాడి చేశారు. ఈమేరకు ఆయన శాయంపేట పోలీసులకు హెడ్‌కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్‌పై మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక శివారులో ఉడుతలను చంపిన వేటగాళ్లను సునీల్ పట్టుకున్నాడు. కాగా, వేటగాళ్లలో ఒకరు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు చేరుకున్నారు. వేటగాళ్లతో పాటు సునీల్‌ను కూడా స్టేషన్‌కు తీసుకొచ్చి దొంగ మాదిరిగా ఫొటోలు తీయడమే గాక జరిగిన విషయాన్ని హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రామ్‌నాయక్‌కు చెబుతున్న క్రమంలో సునీల్ షర్ట్ కాలర్ పట్టుకొని కొట్టారు. అసభ్యకరమైన పదజాలంతో దూషించి గల్లా పట్టుకుని గుంజుకుపోయారని, మరో కానిస్టేబుల్ ఖలీల్ సైతం తనను దుర్భాషలాడి ఫోన్ లాక్కున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇద్దరు పోలీసులు తనపై వేటగాళ్లతో అక్రమ కేసు పెట్టించారని చెప్పాడు. తనను కొట్టి దూషించిన హెడ్‌కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్‌పై ఏస్సై శైలజకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని జిల్లా అటవీ అధికారులు, ఉమ్మడి పర్యావరణ ఐక్యవేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నాడు.

## పట్టపగలే కారులోని రూ.2 లక్షలు చోరీ

**బైక్‌పై కారును వెంబడించిన అగంతకులపై కేసు నమోదు**

**జనగామ సీఐ రఘుపతిరెడ్డి వెల్లడి**

జనగామ చౌరస్తా, మార్చి 26 : పట్టపగలే ఓ బ్యాంకు ముందు పార్కింగ్ చేసి ఉన్న కారు డ్రైవింగ్ సీటు అద్దాన్ని ధ్వంసం చేసి అందులోని రూ.2 లక్షల నగదును దుండగులు చోరీ చేసిన ఘటన జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలం కడవెండికి చెందిన తుమ్మ ప్రతాప్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఏపీ 15 ఏజడ్ 8008 నంబర్ గల కారులో జనగామలోని ఐసీఐసీఐ బ్యాంకుకు చేరుకుని రూ.2 లక్షల నగదును డ్రా చేసుకున్నాడు. అనంతరం తన వెంట వచ్చిన మిత్రుడితో కలిసి హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వెళ్లారు. ఇదే బ్యాంకు వద్ద కారును పార్క్ చేసి లోపలికి వెళ్లారు. అంతకు ముందే ఐసీఐసీఐ బ్యాంకు వద్ద ప్రతాప్‌రెడ్డి నగదును డ్రా చేయడం గమనించిన ఇద్దరు అగంతకులు బైక్‌పై కారును వెంబడిస్తూ పంజాబ్ నేషనల్ బ్యాంకు వరకు వచ్చారు. పార్క్ చేసి ఉన్న కారు డ్రైవింగ్ సీటు వైపున్న అద్దాన్ని ధ్వంసం చేసి అందులోని రూ.2 లక్షల నగదును తీసుకెళ్లారని సీఐ రఘుపతిరెడ్డి పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా ఎస్సై భరత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతిరెడ్డి వెల్లడించారు.



నగదు చోరీకి గురైన కారు

## కాళేశ్వరం ఆదాయం రూ. 22.78 లక్షలు

కాళేశ్వరం, మార్చి 26 : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి హుండీలను మంగళవారం లెక్కించినట్లు ఆలయ ఈవో మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 76 రోజులకు సంబంధించి రూ. 22,78,554 ఆదాయం సమకూరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, బుర్రి శ్రీనివాస్ తదితరులు లెక్కింపును పర్యవేక్షించినట్లు ఈవో తెలిపారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది